క్లుప్తంగా

అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన



పట్నంబజారు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆ శాఖ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం శ్యామలానగర్‌లోని వెంకటేశ్వర బాలకుటీర్, సంగడిగుంటలోని సెయింట్ ప్యాట్రిక్స్ పాఠశాలల్లో విద్యార్థులకు ఎలక్ట్రికల్, గ్యాస్ వల్ల జరిగే ప్రమాదాల్ని అరికట్టే విధానాన్ని ప్రయోగాత్మకంగా సిబ్బంది వివరించారు. విద్యార్థులతో చేయించి, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు ఎస్.పార్థసారథి, పి. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కేర్ వెల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఇఫ్తార్



గుంటూరు మెడికల్: కేర్ వెల్ సూపర్‌స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక నల్లపాడు రోడ్డులోని శ్రీరామ్‌నగర్‌లో రంజాన్ మాసం పురస్కరించుకుని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా ఇఫ్తార్ విందు ఇచ్చారు. నగరంలోని పలు ఆసుపత్రులకు చెందిన వైద్యులు, సిబ్బంది, ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలు పాల్గొన్నారు. హాజీ షేక్ మస్తాన్‌వలి, షేక్ హర్షిద్ పటేల్, షేక్ గౌస్ బాషా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగూర్‌బాషా మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు, జకాత్ లాంటివి చేయడం పుణ్యకార్యమని తెలిపారు.

ఉద్యమ నెల బాలుడు సత్యమూర్తి



నెహ్రూనగర్: సామాజిక న్యాయ, స్వయం గౌరవ పోరాట యోధుడు కేజీ సత్యమూర్తి అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ తెలిపారు. అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో సోమవారం సత్యమూర్తి 11వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లపు నీలాంబరం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పాగళ్ల ప్రకాష్ మాట్లాడుతూ ప్రజా ఉద్యమంలో నెల బాలుడు పాత్ర పోషించిన కేజీ సత్యమూర్తి బడుగు, బలహీన వర్గాల హక్కుల సాధనకై నిరంతరం శ్రమించిన గొప్ప మేధావి అని కొనియాడారు. శివసాగర్ పేరుతో కవిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని తెలిపారు. ముందుగా సత్యమూర్తి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో భీమ్ భారత్ రాష్ట్ర నాయకులు జల్ది మోహన్, మహిళా నాయకురాలు రావినూతల కమల కుమారి, ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి శ్రీనివాసరావు, దళిత పరివర్తన సంఘం నాయకులు జొన్నలగడ్డ శ్రీకాంత్, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బత్తుల అనిల్, భీమ్ భారత్ జిల్లా నాయకులు ఎర్రగుంట్ల సుజాతారావు, పసుమర్తి రమేష్ ప్రసంగించారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు రూరల్: పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశ పరీక్ష పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నల్లపాడు ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ టి.శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లపాడులోని ఎంబీటీఎస్ కళాశాలలో జరిగే ఈ ఉచిత శిక్షణ తరగతుల్లో పదవ తరగతి పూర్తి చేసిన, పరీక్షలు రాసిన అభ్యర్థులు చేరవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 18 నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులకు ఉచిత మెటీరియల్, వసతులు కల్పించనున్నట్లు తెలియజేశారు. వివరాలకు 9885 443624, 97035 23380 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నగరంలో రాత్రి వేళల్లో విస్తృత తనిఖీలు



శ్రీనివాసరావుపేటలో పర్యటిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

నగరంపాలెం: రాత్రి వేళల్లో పెట్రోలింగ్ వాహనాలతో ఏరియాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశించారు. నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాసరావుతోట, అచ్చయ్య డాబా సెంటర్, అరవై అడుగుల రోడ్డులో సోమవారం ఆయన కాలి నడకన పర్యటించారు. ప్రధాన రహదారిలోని సీసీ కెమెరాల పనితీరుని అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లోని స్థానిక ప్రజలతో మాట్లాడారు. వారు తెలియజేసిన సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని సీఐ హైమారావుని ఆదేశించారు. రాత్రి వేళల్లో పోలీస్ గస్తీని ముమ్మరం చేయాలని సూచించారు. ఎస్పీ వెంట ఎస్‌బీ సీఐ బి.నరసింహారావు ఉన్నారు.

వాహనదారుల నుంచి అపరాధ రుసుం వసూలు

జిల్లాలో గత వారం రోజులుగా చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులకు అపరాధ రుసుం విధించినట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబర్ ప్లేట్లు సరిగా లేని సుమారు 860 వాహనాలకు రూ.8.60 లక్షలు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపే 499 మందికి రూ.4.99 లక్షలు, ప్రమాదభరితంగా వాహనాలు నడిపే సుమారు 1,905 మందికి రూ.3.81లక్షలు అపరాధ రుసుం విధించినట్లు ఆయన వివరించారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరిపై కుటుంబం ఆధారపడి ఉంటుందని, బాధ్యతగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ సూచించారు.

విన్నర్‌గా ఏఆర్ ఏఎస్పీ

చిలకలూరిపేటలోని సీఆర్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 16న సీనియర్ డబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లా ఏఎస్పీ (ఏఆర్) కె.కోటేశ్వరరావు విన్నర్ కప్ విజేతగా గెలిచారు. ఆయన్ను సోమవారం పలువురు పోలీస్ అధికారులు అభినందించారు.

పార్టీ విస్తరణలో భాగస్వాములు కావాలి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



గోడపై కమలం గుర్తును చిత్రీకరిస్తున్న వీర్రాజు



గోడలపై పెయింటింగ్ వద్ద బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: బీజేపీ దేశవ్యాప్త ప్రచారంలో భాగంగా మరొక్కసారి మోదీ సర్కార్ నినాదంతో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తోట రామకష్ణ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాల వద్ద గోడ పైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు వాల్ రైటింగ్ చేశారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ నుంచి పార్లమెంటుకు వరకు పార్టీని విస్తరించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రతి పోలింగ్ బూత్‌కి నాలుగేసి చొప్పున వాల్ పెయింటింగ్స్ వేయాలని నిర్ణయించామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శివన్నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి చందు సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి మాగంటి సుధాకర్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాచమల్లు భాస్కర్, అప్పిశెట్టి రంగా, గారపాటి పూర్ణ, వనమా నరేంద్ర, టీవీ రావు, గాజుల వెంకయ్య నాయుడు, పద్మనాభం, తోట శ్రీనివాసరావు, వెలగలేటి గంగాధర్ పాల్గొన్నారు.

కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఖాయం

గుంటూరు మెడికల్: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2024 ఎన్నికల్లోనూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవుతుందని బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తెలిపారు. పార్టీ పిలుపుమేరకు డాక్టర్ ఉమాశంకర్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని పలు ప్రధాన కూడళ్లలోని గోడలపై మరొక్కసారి మోదీ సర్కార్ నినాదాలు రాయించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ కరోనా సమయంలో పేదలకు ఉచితంగా బియ్యంతో పాటు కోవిడ్ వ్యాక్సిన్లు వేయించి ప్రాణాలు కాపాడారని తెలిపారు. మోదీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే ఆయన్ను మరోసారి ప్రధాని చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు మోదీ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి ఇంటింటికీ వెళ్లి వివరించి, ఆయన్ను మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు బీజేపీ కార్యకర్తలంతా చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఈస్ట్ వాల్ రైటింగ్ ఇన్‌చార్జి పోతురాజు వెంకట్, మండల అధ్యక్షుడు సురేష్‌కుమార్ జైన్, కైలాస్ జైన్, షేక్ రఫీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంటూరు ఈస్ట్: విద్యుత్ లైన్ల మరమ్మతుల రీత్యా మంగళవారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీహెచ్.ఖాన్ సోమవారం తెలిపారు. గాంధీనగర్, ఆర్టీసీ కాలనీ, నవభారత్‌నగర్, సాయిబాబా గుడి ప్రాంతం, ఇజ్రాయిల్‌పేట, వెంకట్రావుపేట, రాఘవనగర్, నందివెలుగు రోడ్డుల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేపు డిగ్రీ విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల్లో చదువుతున్న డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు ఈనెల 19న అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు బీకాం, బీఎస్సీ, బయాలాజికల్ సైన్స్, బీ ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. భారత దేశ ఆర్థిక వ్యవస్థపై వస్తు సేవల పన్ను ప్రభావంపై బీకాం విద్యార్థులకు, ఆరోగ్య నిర్వహణ, పునర్వ్యవస్థీకరణలో పోషణ-ఆహారం పాత్రపై బీఎస్సీ బయాలాజికల్ సైన్సెస్ విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9703284136, 9440886535 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కుల దూషణపై కేసు నమోదు

పట్నంబజారు: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత గుంటూరు లోని క్రిస్టియన్‌పేటలో నివాసం ఉండే బి.రవికుమార్‌కు లక్ష్మిశెట్టి అనిల్‌కుమార్ డబ్బులు ఇవ్వాలి. ఈ నేపథ్యంలో రవికుమార్ న్యాయవాదుల ద్వారా అనిల్‌కుమార్‌కు నోటీసులు పంపాడు. ఈ క్రమంలో భాస్కర్ థియేటర్ సమీపంలో ఎదురుపడిన రవికుమార్‌ను అనిల్‌కుమార్ కులం పేరుతో దూషించి దాడి చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోటేశ్వరరావు



నూతన కార్యవర్గం

తెనాలి: గుంటూరు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా పి.వి.కోటేశ్వరరావు కార్యదర్శిగా ఎస్.నిరంజన్‌రావు ఎన్నికయ్యారు. స్థానిక బాలాజీరావుపేటలోని ఘంటా హనుమయ్య సత్రంలో సోమవారం సాయంత్రం జరిగిన సమావేశంలో 2023-2027 సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జె.సింగారావు, జి.ఎస్.రామకృష్ణ, కె.రవిశేఖర్‌రెడ్డి, ఎం.శ్రీనివాసరావు, డి.కృష్ణప్రసాద్, జి.వెంకటనారాయణ, వి.సురేష్‌బాబు, టి.రవికుమార్, సంయుక్త కార్యదర్శులుగా జి.కె.ఎస్. విజయ్‌చంద్, ఎస్.ఏడుకొండలురెడ్డి, బి.హైమారావు, కోశాధికారిగా జె.మహినాథ్‌తో పాటు మరో 11 మంది కార్యవర్గసభ్యుల్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా జి.గోపీచంద్, చీఫ్ పాట్రన్స్‌గా డి.నరేంద్రకుమార్, ఎల్‌వీఆర్ అండ్ సన్స్ గుంటూరును ఎన్నుకున్నారు.

ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలి

అదనపు కమిషనర్ పెద్ది రోజా



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ పెద్ది రోజా

నెహ్రూనగర్: సమస్యలపై ప్రజల నుంచి అందే ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తప్పవని అదనపు కమిషనర్ పెద్ది రోజా స్పష్టం చేశారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ సోమవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫోటోలు జత చేయాలని సూచించారు. సచివాలయ కార్యదర్శుల పనితీరు, సేవలు, స్థానిక సమస్యలపై నోడల్ అధికారులు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ప్రతి రోజు మధ్యాహ్నం వార్డు సచివాలయాల్లో మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు జరిగే స్పందనలో కార్యదర్శులంతా అందుబాటు లో ఉండాలని ఆమె తెలిపారు. సోమవారం నిర్వ హించిన స్పందనలో 52 ఫిర్యాదులు అందాయన్నారు. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి 19, ఇంజినీరింగ్ విభాగానికి 20, ప్రజారోగ్య విభాగానికి నాలుగు, రెవెన్యూ విభాగానికి ఎనిమిది, ఉపా సెల్ విభాగానికి ఒకటి చొప్పున ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఫిర్యాదుల్ని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సీహెచ్. శ్రీనివాస్, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, సీఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్ఓ డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, ఉపా సెల్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు, డెప్యూటీ సిటీప్లానర్లు, ఏసీపీలు, ఈఈలు, ఎస్ఎస్‌లు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు చిరస్మరణీయం



దేవానంద్‌కు పుస్తకాలు అందజేస్తున్న రచయిత గోపాలరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వృత్తి నుంచి భారతదేశ అత్యున్నత పీఠమైన రాష్ట్రపతి పదవిని అలంకరించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. సోమవారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవానంద్ మట్లాడుతూ ప్రథమ ఉప రాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతిగా భారతీయ తాత్విక చింతనలో పాశ్చాత్య తత్వాన్ని ప్రవేశపెట్టిన రాధాకృష్ణన్ దేశానికి ప్రపంచ దేశాల్లో గుర్తింపు తెచ్చారని తెలిపారు. రెండుసార్లు ఉప రాష్ట్రపతి పదవితో పాటు రాష్ట్రపతిగా చైనా, పాకిస్థాన్ యుద్ధ సమయంలో ప్రధానులకు మార్గ నిర్దేశం చేశారని వివరించారు. అనంతరం రచయిత ఉప్పల గోపాలరావు రచించిన 'ఒక సామాజిక స్పృహ గల కార్యకర్త ఆలోచనలు-అభిప్రాయాలు', 'నా మాటల మూట' అనే రెండు పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయానికి బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ యం.సీతారామయ్య, లైబ్రేరియన్ కె.చిన్నపరెడ్డి, యస్.నాగిరెడ్డి, టైపిస్టు కె.శ్రీనివాసరావు, జి.రాజేష్, జూనియర్ అసిస్టెంట్ జి.శ్రీనివాసులు, యం.సంజయ్, కె.పూర్ణచంద్రరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీయాలి



ర్యాలీలో పాల్గొన్న నేతలు

తెనాలి అర్బన్: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల్ని ప్రజలందరూ నిలదీయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఐ, సీపీఎం సంయుక్త ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ప్రచార భేరి సోమవారం పట్టణంలో కొనసాగింది. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నేతలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతోన్మాద బీజేపీని దేశం నుంచి సాగనంపాలని కోరారు. మోదీ ప్రభుత్వం ప్రజల మధ్య మతచిచ్చు పెట్టి వివాదాలు సృష్టిస్తోందని ఆరోపించారు. ప్రజలందరూ సంయమనం పాటించాలని సూచించారు. పేదలకు విద్య, వైద్యం అందని ద్రాక్షలా ఉందని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని మోదీ ప్రభుత్వం నీరుగార్చిందని విమర్శించారు. అనంతరం బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్‌బాబు, సీపీఎం నాయకులు ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలీ, మహిళా నాయకురాలు రాజ్యలక్ష్మి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, ఏఐవైఎఫ్ నాయకులు పల్నాటి నాగరాజు, బిల్లా రాజేష్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

పట్నంబజారు: లారీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏటీ అగ్రహారం 11 లైనుకు చెందిన సాహు ఢిల్లీ రాజు(45) హోటల్లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి పనులు ముగించుకుని చుట్టుగుంట సమీపంలో రోడ్డు దాటుతున్న సమయంలో నల్లపాడు వైపుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

23న ఘంటసాల చైతన్య వేదిక జాతీయ మహాసభలు



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, వెంకటేశ్వరరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంలో ఈనెల 23న ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక 12వ జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఘంటసాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డితో కలసి మహా సభల కరపత్రాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన మానవీయ సమాజం ఏర్పడాలంటే విద్య, కళలు ద్వారా సాంస్కృతిక విప్లవం జరగాలనే నేపథ్యంలో జన విజ్ఞాన వేదిక, స్టెప్పు, ప్రగతి నారీశక్తి, అవగాహన సంస్థల సహకారంతో 'మానవుడే మహనీయుడు' అంశంతో ఒకరోజు వర్క్ షాప్‌ను రాజీవ్ గాంధీ నగర్ కాలనీ శ్రీవేంకటేశ్వర పబ్లిక్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళలు, సాంస్కృతిక రంగాలపై గ్లోబలైజేషన్ ప్రభావం, తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణ ప్రజలు, ప్రభుత్వాల కర్తవ్యం తదితర అంశాలపై మేధావులతో చర్చతో పాటు 100 సినీ, దేశభక్తి, అభ్యుదయ చైతన్య గీతాల సంగీత విభావరి రోజంతా జరుగుతుందని తెలియజేశారు నగరంలోని విద్యావంతులు, కళాకారులు, సంగీతాభిమానులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. కరపత్రాల ఆవిష్కరణలో నర్రా రాజశేఖర్, ఆలా అనంతరామయ్య, షేక్ సుభాని, కె. ప్రణయ్ కుమార్ పాల్గొన్నారు

దాడి, దోపిడీ కేసులో జైలు, జరిమానా

తెనాలి రూరల్: వ్యక్తిపై దాడి చేసి ఫోన్ లాక్కు వెళ్లిన ఘటనలో నిందితులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి రైల్వే స్టేషన్ వద్ద గతేడాది ఏప్రిల్ 6న ఓ వ్యక్తిపై ముగ్గురు యువకులు దాడి చేసి గాయపర్చి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ లాక్కు వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీ టౌన్ ఎస్ఐ ఎం. విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి, నిందితుల్ని పట్టణానికి చెందిన గడ్డం రాజు, చంపల మణికంఠ, మూకిరి గోపి, కన్నెగంటి మోహన్‌కృష్ణగా గుర్తించి కోర్టులో హాజరుపరిచారు. కేసు సోమవారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాల్ని పరిశీలించిన ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా, నిందితులకు ఆరు నెలల జైలుశిక్ష, రూ. 400 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున సీనియర్ ఏపీపీ పి. సునీల్‌కుమార్ వాదించారు.

కళాకారుడు, గాయకుడు శాంసన్‌కు సన్మానం

తెనాలి అర్బన్: నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో సోమవారం సరదారాముడు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. మంగళవారం భట్టివిక్రమార్క చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కళాకారుడు, గాయకుడు తురిమెళ్ల శాంసన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, రవీంద్ర, సాంబశివరావు, పోతురాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటిలో చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంటిలో చోరీపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. నర్రా పవన్‌కుమార్ బ్రాడీపేటలో ఉన్న తన ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇళ్లల్లో నివసిస్తున్నాడు. శుక్రవారం ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలకెళ్లి పరిశీలించగా, టీవీ, నీళ్ల మోటారు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

పేకాట ఆడుతున్న నలుగురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కళాకారుల కాలనీలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం సోమవారం పోలీసులు దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 5,200 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

గుంటూరు మెడికల్: వ్యక్తిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిత్యనగర్‌లో నివసించే శ్రీను సోమవారం శారదా కాలనీ ఆర్చి సెంటర్‌లో ఉండగా, పాత కక్షల నేపథ్యంలో ఇద్దరు అతడిపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్ బోర్డు ఉద్యోగిపై..

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై పలువురు దాడిచేసి గాయపరిచిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా వక్ఫ్ బోర్డు జాయింట్ సెక్రటరీ సుభాని ఆదివారం రాత్రి బ్రాడీపేటలో ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి రాడ్లతో దాడి చేసి గాయపరిచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.